సాక్షి
కర్నూలు
గురువారం । 30 । మార్చి । 2023



కుటీర నిర్మాణ పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: కుటీర నిర్మాణ పథకానికి గుంటూరుకు చెందిన గంధళ్ల బ్రహ్మానందం, ఉదయ లక్ష్మి, డా.గంధళ్ల సాయిసాజన్య, బనిగళ్లపాటి శశిధర్ రూ.15 లక్షలు విరాళంగా ఇచ్చారు.



సుంకేసులకు ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి బుధవారం 1,050 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. డ్యాంలో 1.026 టీఎంసీల నీరు నిల్వ ఉండగా కేసీ కెనాల్‌కు 602 క్యూసెక్కులు విడుదల చేశారు.

ఉష్ణోగ్రతలు

కనిష్టం	27.2
గరిష్టం	37.6

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:35	ఉ॥ 4:51
ఆదోని	సా॥ 6:38	ఉ॥ 4:54
నంద్యాల	సా॥ 6:35	ఉ॥ 4:54
ఆత్మకూరు	సా॥ 6:33	ఉ॥ 4:49
బనగానపల్లె	సా॥ 6:36	ఉ॥ 4:49

హదీస్ వెలుగు :

చాడీలు చెప్పడం, ఇద్దరి మధ్య గిల్లలు పెట్టి వారిని దూరం చేయడం, బంధువుల మధ్య సంబంధాలు తెంచడం చాలా పాపం. ఇలాంటి వాటి పట్ల దూరంగా ఉండండి. - పవిత్ర ఖురాన్

తాగునీటి ఎద్దడి తలెత్తనివ్వొద్దు

రూ.10.97 కోట్ల కార్యాచరణ ప్రణాళిక

- ఒక్కో జెడ్పీటీసీకి రూ.5లక్షలు చొప్పున నిధులు
- జెడ్పీటీసీల గుర్తింపునకు సీఎంతో చర్చిస్తా: మంత్రి గుమ్మనూరు
- దెబ్బతిన్న పంటల నష్ట పరిహారానికి ప్రత్యేక చర్యలు



జెడ్పీ సర్వసభ్య సమావేశానికి హాజరైన ఉమ్మడి కర్నూలు జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీటీసీలు

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రస్తుత వేసవిలో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పనా శాఖా మంత్రి గుమ్మనూరు జయరాం ఆదేశించారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్సీలు గంగుల ప్రభాకర్‌రెడ్డి, కత్తి నరసింహారెడ్డి, ఇషాక్‌బాషా, పాణ్యం, బనగానపల్లె, నందికొట్కూరు, ఆళ్లగడ్డ ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కాటసాని రామిరెడ్డి, తొగురు ఆర్థర్, గంగుల బిజేంద్రారెడ్డి, నంద్యాల కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవతేజ హాజరయ్యారు. సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా, భూగర్భ జల వనరులు, గృహ నిర్మాణం, పశు సంవర్ధక శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జయరాం మాట్లాడుతూ తాను జెడ్పీటీసీ స్థాయి నుంచి మంత్రి స్థాయికి వచ్చానని, జెడ్పీటీసీల గుర్తింపునకు సంబంధించిన అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. సమావేశం జరుగుతున్న సమయంలో మెజారిటీ జెడ్పీటీసీలు తమ పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఎలాంటి నిధులు కేటాయించడం లేదని, కనీసం ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రత్యేక గది కూడా లేదని.. మండలాల్లో తాము ఉత్సవ విగ్రహాల్లా మారామని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే మంత్రి జయరాం పైవిధంగా స్పందించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి, ఈవీ సుబ్బారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు బి.నాగేశ్వరరావు, సీహెచ్ మనోహర్, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, గృహ నిర్మాణ సంస్థ ఈఈలు సి.నాగరాజు, మాధవరావు, పీఆర్ ఎస్ఈ కె.సుబ్రమణ్యంతో పాటు రెండు జిల్లాలకు చెందిన వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యారు.

245 జనావాసాల్లో రూ.10.97 కోట్లతో కార్యాచరణ

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రస్తుత వేసవిలో దాహార్తిని తీర్చేందుకు రూ.10.97 కోట్లతో కార్యాచరణను రూపొందించి ప్రభుత్వానికి పంపినట్లు కర్నూలు, నంద్యాల ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు బి.నాగేశ్వరరావు, సీహెచ్ మనోహర్ చెప్పారు. కర్నూలు జిల్లాలో 107 జనవాసాల్లో రూ.8.08 కోట్లు, నంద్యాల జిల్లాలో 138 జనవాసాల్లో రూ.2.89 కోట్లతో ప్రణాళికలు రూపొందించామన్నారు.

రూ.5 లక్షలు చొప్పున నిధులు

తాగునీటి ఎద్దడి నివారణకు ఒక్కో జెడ్పీటీసీకి రూ.5లక్షలు చొప్పున కేటాయిస్తున్నాం. ఈ నిధులను ప్రస్తుత వేసవిలో తమ పరిధిలో తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు వినియోగించాలి. అలాగే జెడ్పీటీసీలు తమ పరిధిలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు అందజేస్తే పరిశీలించి నిధులు కేటాయిస్తాం. - జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి

పాణ్యం, ఓర్వకల్లు మండలాలను ఎలా విస్మరిస్తారు

పాణ్యం నియోజకవర్గంలో గోరుకల్లు రిజర్వాయర్ నుంచి వాటర్ గ్రిడ్ ద్వారా డోన్ నియోజకవర్గానికి నీటిని తీసుకెళ్తూ పక్కనే ఉన్న పాణ్యం, ఓర్వకల్లు మండలాలను ఎలా విస్మరిస్తారు. ఈ విషయంపై నేను రాసిన లేఖపై ఏం చర్యలు తీసుకున్నారో ఆర్‌డబ్ల్యూఎస్ నంద్యాల జిల్లా ఇంజినీరు సీహెచ్ మనోహర్ సమాధానం చెప్పాలి. పాణ్యం నియోజకవర్గంలో ఎన్ఆర్ఈజీఎస్ కింద చేపట్టిన 89 పనులకు నేటికీ బిల్లులు అందలేదు. - ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు జయరాం, చిత్రంలో జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి

గృహ నిర్మాణ సమస్యలను పరిష్కరించండి

గృహ నిర్మాణాలకు సంబంధించిన సమస్యలను నిర్ణీత కాల వ్యవధిలోగా పరిష్కరించాలి. గత ప్రభుత్వంలో లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ.1 జమ కావడం, ఆధార్‌కార్డు నెంబర్లలో వ్యత్యాసాలు ఉండడం వల్ల అనేక గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులకు గృహాలు మంజూరు కాని పరిస్థితి నెలకొంది. సచివాలయ ఉద్యోగులందరినీ గృహ నిర్మాణ సమస్యల పరిష్కారంలో భాగస్వాములను చేయాలి. - గంగుల ప్రభాకర్‌రెడ్డి, ప్రభుత్వ విప్

గ్రామం యూనిట్‌గా జేజేఎం టెండర్లు పిలవండి

బనగానపల్లె నియోజకవర్గంలో రూ.70 కోట్ల విలువైన జలజీవన్ మిషన్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. మిగిలిన రూ.30 కోట్ల పనులకు గ్రామం యూనిట్‌గా టెండర్లు పిలవాలి. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిన ఓహెచ్ఎస్ఆర్‌ల స్థానంలో కొత్తవి నిర్మించాలి. కుడా పరిధిలోని గ్రామాల్లో గృహాలు మంజూరైన నేపథ్యంలో వెంటనే మ్యాపింగ్ చేయాలి. - ఎమ్మెల్యే, కాటసాని రామిరెడ్డి

జేజేఎం పనుల్లో స్తబ్ధత

నందికొట్కూరు నియోజకవర్గంలో జల జీవన్ మిషన్ పనుల్లో తీవ్ర స్తబ్ధత నెలకొంది. పనులు చేపట్టకుంటే కాంట్రాక్టర్లను మార్చాలి. కొత్తపల్లి మండలం గుమ్మడాపురం గ్రామానికి చెందిన రోడ్డును అభివృద్ధి చేయాలి. ప్రస్తుత వేసవిలో కేసీ కెనాల్ పనులు చేపట్టి పూర్తి చేయాలి. - ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివేదికలు పంపండి

అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు సంబంధించి వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలించి వాస్తవ నివేదికలను ఈ నెల 30వ తేదీలోగా ప్రభుత్వానికి పంపాలి. అనేక మంది రైతులు ఈ క్రాప్ చేసుకోకపోవడం వల్ల పరిహారం అందని పరిస్థితులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రాప్ చేయించాల్సిన బాధ్యత వ్యవసాయ శాఖ అధికారులది కాదా? - ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి

నాలుగు తీర్మానాలకు ఆమోదం

- గ్రామం యూనిట్‌గా జేజేఎం పనులకు టెండర్లు పిలవాలని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చేసిన ప్రతిపాదన ప్రభుత్వానికి పంపడం.
- గ్లోబల్ సమ్మిట్ విజయవంతంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నేతృత్వంలోని మంత్రులను అభినందిస్తూ సాధ్యమైనంత త్వరగా ఒప్పందాలు కార్యరూపం దాల్చేందుకు కృషి చేయాలి.
- వాల్మీకి/బోయ కులాలను ఎస్టీలుగా, దళిత క్రిస్టియన్లను ఎస్సీలుగా గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానం పట్ల హర్షం.
- ఎమ్మెల్సీలుగా పదవీ విరమణ చేసిన గంగుల ప్రభాకర్‌రెడ్డి, వెన్నపూస గోపాల్‌రెడ్డి, కత్తి నరసింహారెడ్డిలకు అభినందన.

పెండింగ్ బిల్లులను విడుదల చేయండి

ప్రభుత్వ అభివృద్ధి పనులకు చేపట్టిన కాంట్రాక్టర్లకు వెంటనే బిల్లులు చెల్లించాలి. కర్నూలు, నంద్యాల తదితర ప్రాంతాల్లో నిర్మించిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు ఎప్పుడు స్వాధీనం చేస్తారు. నగర శివారులోని జగన్నాథగట్టు ప్రాంతంలో జర్నలిస్టులకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో మట్టిని తవ్వి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి. - ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

ఇళ్ల స్థలాలు కేటాయించాలి

నంద్యాల పరిధిలోని అయ్యలూరు వద్ద గతంలో 900 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించి పట్టాలు ఇచ్చారు. అయితే ప్రస్తుతం ఆ స్థలాల్లో టిడ్కో గృహాలను నిర్మించిన నేపథ్యంలో అప్పట్లో ఇళ్ల స్థలాలు పొందిన వారి పేర్లన్నీ ఆన్‌లైన్‌లో ఉండడం వల్ల వీరికి ఎక్కడా ఇళ్ల స్థలాల కేటాయింపు జరగడం లేదు. ఆన్‌లైన్‌లో వీరి పేర్లను తొలగించి అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలి. - ఇసాక్‌బాషా, ఎమ్మెల్సీ

న్యూస్‌రీల్

జిల్లా ట్రెజరీ డీడీకి నంద్యాల జిల్లా బాధ్యతలు



రామచంద్రరావు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా ఖజానా కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ బి.రామచంద్రరావు పూర్తి అదనపు బాధ్యతలతో నంద్యాల జిల్లా ట్రెజరీ అధికారిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఖజానా శాఖ డైరెక్టర్ ఎన్.మోహన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల జిల్లా ట్రెజరీ అధికారిగా పనిచేస్తున్న లక్ష్మీదేవీ చైల్డ్‌కేర్ సెలవుల్లో వెళ్లారు. ఇందువల్ల రామచంద్రరావుకు నంద్యాల జిల్లా బాధ్యతలు అప్పగించారు.

ఆరోగ్య కార్యకర్తలకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మహిళా ఆరోగ్య కార్యకర్తలు 22 మందికి బుధవారం డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య తన ఛాంబర్‌లో కౌన్సెలింగ్ నిర్వహించి ఉత్తర్వులు జారీ చేశారు. ఆరోగ్య కార్యకర్తలను మున్సిపాల్టీల పరిధిల్లో స్థానాలు కేటాయించారు. ఇందులో ఏవో డాక్టర్ నాగప్రసాద్, సూపరింటెండెంట్ అరుణ, సీనియర్ అసిస్టెంట్లు మధుసూదన్, వెంకట నారాయణ పాల్గొన్నారు.

ఇకపై మెడికల్ కాలేజీల్లో సీఎంఈలు

- ఆదేశాలు జారీ చేసిన వైద్యవిద్యాశాఖ

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్రంలోని అన్ని మెడికల్ కాలేజీలు ఇకపై మూడు నెలలకు ఒకసారి క్రమం తప్పకుండా జోనల్ సీఎంఈ (నిరంతర వైద్య విజ్ఞాన సదస్సు) నిర్వహించాలని వైద్య విద్యాశాఖ సంచాలకులకుల నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, మెడికల్ కాలేజీలను పలు జోన్లుగా విభజించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కర్నూలు మెడికల్ కళాశాల, శాంతిరామ్, విశ్వభారతి మెడికల్ కాలేజీలను ఒక జోన్‌గా ఏర్పరిచారు. ఈ కాలేజీలు ప్రతి మూడు నెలలకు ఒకసారి జోనల్ సీఎంఈ నిర్వహించాల్సి ఉంటుంది. ఈనేపథ్యంలో ఏప్రిల్ 9వ తేదీన కర్నూలు మెడికల్ కాలేజీలో జనరల్ మెడిసిన్ విభాగం జోనల్ సీఎంఈ నిర్వహించనున్నారు. ఇందులో కర్నూలుతో పాటు విశ్వభారతి, శాంతిరామ్ కాలేజీల నుంచి వైద్యులు, ఫ్యాకల్టీ హాజరుకానున్నారు. ఈ సదస్సులో పాల్గొన్న ఆయా వైద్యులకు పాయింట్లు కేటాయించనున్నారు.

2న వాల్మీకుల చలో కర్నూలు



కరపత్రాలు విడుదల చేస్తున్న వీఆర్‌పీఎస్ నేతలు

కర్నూలు(అర్బన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతగా ఏప్రిల్ 2వ తేదీన చేపట్టే చలో కర్నూలు, మహాప్రదర్శన కార్యక్రమానికి ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి వేలాదిగా వాల్మీకులు తరలిరావాలని వీఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.సుభాష్ చంద్రబోస్ పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం స్థానిక కార్యాలయ ఆవరణలో అందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ అంశాన్ని గత పాలకులు పట్టించుకోలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఈనెల 24వ తేదీన వాల్మీకి/బోయ కులాలను ఎస్టీలుగా గుర్తిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేశారన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసేందుకు భారీ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో వీఆర్‌పీఎస్ నేతలు శ్రీనివాసులు, రమణ, మహేష్, మద్దయ్య, సంజన్న, విద్యార్థి నేతలు అర్జున్, మధు తదితరులు పాల్గొన్నారు.

మహిళల్లో 'ఆసరా' హర్షాతిరేకం



పత్తికొండలో పొదుపు మహిళలకు ఆసరా చెక్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



ఆదోని మండలం మదిర గ్రామంలో లబ్ధిదారులకు ఆసరా చెక్ అందజేస్తున్న ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్

- జిల్లా వ్యాప్తంగా ఆసరా చెక్కుల పంపిణీ
- సీఎం చిత్రపటాలకు పాలతో అభిషేకం చేస్తున్న లబ్ధిదారులు

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్సార్ ఆసరా సంబరాలు ఊరూరా ఉత్సాహంగా సాగుతున్నాయి. రుణవిముక్తులు చేసినందుకు పొదుపు మహిళలు సంతోషం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలకు పాలతో అభిషేకం చేస్తున్నారు. బుధవారం ఐదు మండలాలతో పాటు కర్నూలు నగరపాలక సంస్థ, ఎమ్మిగనూరు మున్సిపాలిటీలో ఆసరా సంబరాలు పెద్ద ఎత్తున జరిగాయి. మూడవ విడత ఆసరా సాయానికి సంబంధించిన మెగా చెక్కులను ప్రజాప్రతినిధులు పొదుపు మహిళలకు అందజేశారు. మహిళల జీవనోపాధుల మెరుగుకు సీఎం కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఐదు మండలాల్లో జరిగిన ఆసరా సంబరాల్లో 11వేలమందికి పైగా మహిళలు పాల్గొని థాంక్యూ సీఎం సార్ అంటూ నినదించారు. ఈ నెల 29 నాటికి 13 మండలాల్లో ఆసరా సంబరాలు పూర్తి అయ్యాయి.

- ఆదోని మండలం మదిర గ్రామంలో జరిగిన ఆసరా సంబరాల్లో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, శాసనమండలి సభ్యుడు డాక్టర్ మధుసూదన్ పాల్గొన్నారు. 1,174 స్వయం సహాయక సంఘాలకు రూ.5.16 కోట్లు మంజూరైనట్లు వారు తెలిపారు.
- పత్తికొండ మండలంలో జరిగిన ఆసరా వేడుకల్లో వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కర్నూలు నగరపాలక సంస్థ మేయర్ బీవై రామయ్య, పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పాల్గొని ప్రసంగించారు. ఇక్కడ దాదాపు 3,600 మంది పొదుపు మహిళలు పాల్గొన్నారు. ఈ మండలంలో 714 సంఘాలకు రూ.3.69 కోట్ల విలువ చేసే చెక్‌ను వారు అందజేశారు.
- గూడూరు మండలం గుడిపాడులో జరిగిన కార్యక్రమంలో 313 సంఘాలకు రూ.1.74 కోట్ల చెక్‌ను కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ అందజేశారు.
- కర్నూలు ఏ-క్యాంపులో జరిగిన ఆసరా సంబరాలకు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ హాజరై 3,034 సంఘాలకు రూ. 19.90 కోట్ల మెగా చెక్ పంపిణీ చేశారు.
- ఎమ్మిగనూరు మున్సిపాలిటీలో జరిగిన ఆసరా వేడుకల్లో ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి 1,381 సంఘాలకు రూ.9.80 కోట్లు మెగా చెక్ అందజేశారు. ఆసరా సంబరాల్లో అర్బన్ ప్రాంతాల్లో వార్డు సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

లైఫ్ సర్టిఫికెట్లు ఇవ్వకపోయినా మార్చి నెల పెన్షన్

- ఖజానా శాఖ డైరెక్టర్ ఆదేశాలు
- లైఫ్ సర్టిఫికెట్స్ ఇచ్చేందుకు ఏప్రిల్ 15 వరకు అవకాశం

కర్నూలు(అగ్రికల్చర్): లైఫ్ సర్టిఫికెట్లు ఇవ్వకపోయినప్పటికీ పెన్షన్‌దారులకు మార్చి నెల పింఛన్ చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముందుగా రాష్ట్ర ఖజానా శాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం 2023 సంవత్సరానికి సంబంధించి ఫిబ్రవరి చివరిలోగా లైఫ్ సర్టిపికెట్లు ఇవ్వాల్సి ఉంది. తర్వాత ఈ గడువును మార్చి నెల చివరి వరకు పొడిగించింది. అయితే ఇప్పటికీ కొంతమంది లైఫ్ సర్టిఫికెట్లు ఇవ్వలేకపోయారు. అయితే మార్చి నెల పెన్షన్ అందరికీ చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు జిల్లా ట్రెజరీ అధికారులు స్పష్టం చేశారు. ఈ మేరకు ఖజానా శాఖ డైరెక్టర్ మోహన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లను ఏప్రిల్ 15లోగా సంబంధిత ట్రెజరీ అధికారులకు జీవన్‌ప్రమాణ్ యాప్ ద్వారా అప్‌లోడ్ చేయాల్సి ఉంది. బెడ్‌పై ఉండి కదలలేని వారు మాన్యువల్‌గా ఇవ్వవచ్చు. సంబంధిత ట్రెజరీ అధికారులు వీడియో కాల్ ద్వారా ధ్రువీకరించుకుంటారని అధికారులు తెలిపారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

- ఏప్రిల్ 1 నుంచి మూల్యాంకనం

కర్నూలు సిటీ: ఈ నెల 15వ తేదీన మొదలైన ఇంటర్ పరీక్షలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజున ఇంటర్ సెకండియర్ పరీక్షలు జరిగాయి. 123 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షలకు 32,979 మంది విద్యార్థులకుగాను 31,798 మంది హాజరయ్యారు. కాపీయింగ్‌కు పాల్పడుతూ నందికొట్కూరు జూనియర్ కాలేజీలో 8 మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. కాగా 31వ తేదీతో వొకేషనల్ పరీక్షలు, ఏప్రిల్ 3, 4 తేదీల్లో మోడ్రన్ లాంగ్వేజ్ పరీక్షలు ఉమ్మడి జిల్లాలోని 3 కేంద్రాల్లో జరుగనున్నాయి. ప్రధాన సబ్జెక్టులు పూర్తి కావడంతో ఏప్రిల్ 1 నుంచి మూల్యాంకనం నిర్వహించేందుకు ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

డిగ్రీ పరీక్షల్లో 8 మంది డిబార్

రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ సెమిస్టర్ రెగ్యులర్/ సప్లిమెంటరీ పరీక్షల్లో 8 మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. పరీక్షలకు ఉదయం 1,890 మందికిగాను 1,751 మంది, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 9,484 మందికి గాను 8603 మంది హాజరైనట్లు వర్సిటీ పరీక్షల విభాగం అధికారులు తెలిపారు.

ఈ-పాస్‌లోకి ఎరువుల అమ్మకాలు

కర్నూలు(అగ్రికల్చర్): 2022-23 సంవత్సరంలో విక్రయించిన రసాయన ఎరువుల అమ్మకాలను విధిగా ఈ-పాస్‌లోకి తీసుకురావాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి రీటైల్ డీలర్లు, ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లు, పీఏసీఎస్ సీజీవోలు, డీసీఎంఎస్ మేనేజర్లను బుధవారం ఓ ప్రకటనలో ఆదేశించారు. ఈ-పాస్‌లో ఎరువుల నిల్వ ఎంత ఉందో.. ఫిజికల్‌గా కూడా అంతే ఉండాలని, ఇందుకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ-పాస్ స్టాకును బట్టే ప్రభుత్వం 2023-24 సంవత్సరానికి ఎరువులను కేటాయిస్తుందని తెలిపారు. ఈ-పాస్‌లో ఉన్న ఎరువుల నిల్వలు, వాస్తవ ఎరువుల నిల్వలను పరిశీలించేందుకు ఏప్రిల్ మొదటి వారంలో కమిషనరేట్ నుంచి ప్రత్యేక టీమ్ వస్తుందని తెలిపారు. తేడాలు ఉంటే సంబంధిత డీలర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. డీలర్లు ఎరువుల నిల్వలను ఈ-పాస్‌తో పోల్చి చూసుకోవాలని సూచించారు.

నగదు పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు (టౌన్): గతేడాది ఆగస్టు నెల 11 వ తేదీకి ముందు అంతర్జాతీయ స్థాయి పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు, వారికి తర్ఫీదు ఇచ్చిన శిక్షకులకు రాష్ట్ర ప్రభుత్వం నగదు పురస్కారాలు, బహుమతులు అందజేస్తుందని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ రమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తును https://dbtyas.sports.gov.in వెబ్‌సైట్‌లో భర్తీచేసి ఆన్‌లైన్‌లోనే సమర్పించాలని తెలిపారు. భౌతికంగా తీసుకొచ్చే దరఖాస్తులు స్వీకరించబడవన్నారు. దరఖాస్తు గడువు ఏప్రిల్ 30 వ తేదీ వరకు ఉందన్నారు.

టెక్కె మిర్చియార్డు అభివృద్ధికి కృషి

నంద్యాల(అర్బన్): పట్టణంలోని టెక్కె మిర్చియార్డు అభివృద్ధికి కృషి చేస్తానని మార్కెట్ యార్డు రాయలసీమ రీజినల్ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు తెలిపారు. స్థానిక యార్డును బుధవారం ఆయన యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, కార్యదర్శి కల్పన, అసిస్టెంట్ కార్యదర్శి శేషిరెడ్డిలతో కలిసి పరిశీలించారు. కమీషన్ ఏజెంట్లు, రైతులు, ట్రేడర్స్ సమస్యలను ఆర్జేడీని అడిగి తెలుసుకున్నారు. గుంటూరు మిర్చియార్డు తరహాలో క్రయవిక్రయాలు జరుగుతుండడం అభినందనీయమన్నారు. కమీషన్ ఏజెంట్లకు షెడ్ల ఏర్పాటుతో పాటు సీసీ కెమెరాలు, స్వచ్ఛమైన తాగునీటిని అందించనున్నామన్నారు.

నలుగురు ఎస్ఐల బదిలీ

కర్నూలు (అర్బన్): జిల్లాలోని నలుగురు ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ రామయ్యను తాలూకా పోలీస్‌స్టేషన్‌కు, తాలూకా పీఎస్‌లో పనిచేస్తున్న లక్ష్మీనారాయణను కర్నూలు వన్‌టౌన్‌కు, వీఆర్‌లో ఉన్న మధుసూదన్ రావును నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు, చిన్నపీరయ్యను ఆదోని మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

క్లుప్తంగా

వడదెబ్బతో మహిళ మృతి


నారాయణమ్మ(ఫైల్)

సంజామల(కోవెలకుంట్ల): సంజామల మండలం పేరుసోముల గ్రామానికి చెందిన నారాయణమ్మ(63) బుధవారం వడదెబ్బతో మృతి చెందింది. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన నారాయణమ్మ మిర్చి కోత పనులకు వెళ్లింది. ఎండ తీవ్రత అధికం కావడంతో అపస్మారక స్థితికి చేరుకుంది. తోటి కూలీలు ఆమెను ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేయగా అప్పటికే మృతిచెందింది.

వివాహిత ఆత్మహత్య


మృతి చెందిన షేక్ రేష్మాబీ

పాణ్యం: భర్త, అత్త వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన తమ్మరాజుపల్లె గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ మధుసూదన్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రహిమాబీ కూతురు షేక్ రేష్మాబీ(36)ని తాంద్రపాడులో నివాసముంటున్న షాషావలికి ఇచ్చి గతంలో వివాహం చేశారు. వీరికి కుమారుడు, కూతురు సంతానం. షేక్ రేష్మాబీని కొంతకాలంగా భర్తతో పాటు అత్త నూర్‌బీ వేధిస్తుండడంతో ఇటీవల పుట్టినింటికి చేరుకుంది. అయినా వదలకుండా భర్త పదేపదే ఫోన్ చేసి తిట్టేవాడు. రెండు రోజుల క్రితం భర్త, అత్త తమ్మరాజుపల్లెకు వచ్చి కాపురానికి రావాలని కోరారు. నిరాకరించడంతో బూతులు తిట్టడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరెతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి రహిమాన్‌బీ ఫిర్యాదు మేరకు భర్త, అత్తపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సెబ్ ఎస్ఐ సస్పెన్షన్

కర్నూలు: ఆదోని డివిజన్ మొబైల్ పార్టీలో విధులు నిర్వహిస్తున్న ఓ సెబ్ ఎస్ఐని ఉన్నతాధికారులు సస్పెన్షన్ చేసినట్లు తెలిసింది. ఈనెల 19న కర్ణాటకలోని ఇటికెల గ్రామ సమీపంలో ఓ చెక్‌పోస్టు వద్ద పోలీస్ నేమ్‌ప్లేట్‌తో ఉన్న ఏపీ 39 టీటీ 2557 నంబర్ కారులో 4 బాక్సుల కర్ణాటక మద్యం లభ్యమైంది. ఈ కేసుకు సంబంధించి అప్పట్లోనే డ్రైవర్‌పై కేసు నమోదైంది. పోలీసు అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి కేసుతో సంబంధమున్న ఎస్ఐని సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది.

నూతన కమిటీ ఎన్నిక


నూతన కమిటీ సభ్యులు

కర్నూలు సిటీ: కర్నూలు–నంద్యాల జిల్లాల వొకేషనల్ జూనియర్ కాలేజీల యాజమాన్యాల సంఘం నూతన కమిటీ ఎన్నికైంది. బుధవారం నగరంలోని ఓ హోటల్‌లో కార్యవర్గ సమావేశం నిర్వహించి కమిటీ అధ్యక్షుడిగా కె.వేణుగోపాల్, ఉపాధ్యక్షుడిగా బి.సునీల్‌ను ఎన్నుకున్నారు. అలాగే కార్యదర్శిగా ఎస్.దేవదానం, సంయుక్త కార్యదర్శిగా దివాకర్, కోశాధికారిగా ఇ. కిరణ్‌కుమార్, కార్యనిర్వాహక సభ్యులుగా ఎ.పవన్, బి.కిశోర్, ఇ. రమేష్ బాబు, విశ్వనాథ్, ముఖ్య సలహాదారులుగా ఇ.పద్మాకర్, గౌరవ అధ్యక్షుడిగా ఆర్.విరూపాక్షిలను నియమించారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్ష,కార్యదర్శులు మాట్లాడుతూ వొకేషనల్ కాలేజీ యాజమాన్యాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.






రంజాన్ సందడి

కర్నూలు నగరంలో రంజాన్ సందడి మొదలైంది. ఎక్కడ చూసినా ఘుమఘుమలాడే హలీం, హరీస్ సెంటర్లు, వేడివేడి సమోసాలు, పెరుగువడ, ఫలహార విక్రయ దుకాణాలు వెలిశాయి. ఇఫ్తార్ సమయంలో ముస్లింలు ఎక్కువగా సులభంగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలతో దీక్షను విరమిస్తారు. వాటి కొనుగోలు దృశ్యాలివీ.. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

రూ. 80 లక్షల వెండిమాయం!

తనిఖీల్లో పట్టుబడిన 105 తులాల వెండి, రూ.2.50లక్షల నగదు

- విలువ రూ.80లక్షలకు పైమాటే
- నిబంధనలకు విరుద్ధంగా స్టేషన్‌లోనే ఉంచుకున్న సీఐ
- ఆ తర్వాత ఎవరికీ తెలియకుండా మాయం
- ఓ రైటర్, మరో ఇద్దరు పోలీసుల పాత్ర
- రహస్య విచారణతో నిర్ధారణ?

ఉన్నతాధికారుల దృష్టిలో ఆ పెద్దసారు నిఖార్సయిన పోలీసు.. విధి నిర్వహణలో నిబద్ధతతో వ్యవహరిస్తారనే నమ్మకం చూరగొన్నారు.. ప్రజాప్రతినిధులైనా సరే ఆయన దృష్టిలో అంతా సమానమే. ఇలా చెప్పుకుంటూ పోతే ఆ సారు డిపార్ట్‌మెంట్‌లో ఆదర్శం అనే అనుకోవాలి. అంతా బాగానే ఉన్నా.. ఆయన గతంలో పనిచేస్తున్న ఓ పోలీసుస్టేషన్‌లో రూ.80లక్షల విలువైన వెండి మాయమైన ఘటన ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. నిన్నటి వరకు ఆహా.. ఓహో అని ఆయన మాయలోని కొందరు ఉన్నతాధికారులు పొగిడినా.. ఇప్పుడు ఒక్కదెబ్బకు పోలీసు శాఖ విస్తుపోయే ఘటన కలకలం రేపుతోంది.



కర్నూలు: ''సెలవులు వస్తున్నాయి.. ఎవరైనా ఊళ్లకు వెళ్లాలంటే ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వండి. మీ ఇంటి భద్రత మాదీ.. సీసీ కెమెరాల పర్యవేక్షణతో దొంగల భరతం పడతాం..'' ఇలా పోలీసు బాస్‌లు ప్రజలకు భరోసా కల్పిస్తుండగా.. ఆ శాఖలోని ఓ ఇంటి దొంగ బాగోతం పోలీసుల చిత్తశుద్ధినే ప్రశ్నార్థకం చేస్తోంది. తనిఖీల్లో దొరికిన విలువైన వస్తువులకు సంబంధించి ఎలాంటి బిల్లులు లేకపోతే పోలీసు శాఖ ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ ఆధీనంలో ఉంచాలనేది నిబంధన. కానీ ఓ పోలీసు అధికారి కొంతకాలం పోలీసుస్టేషన్‌లోనే భద్రపరిచినా.. ఆ తర్వాత మూడో కంటికి తెలియకుండా మాయం చేయడం ఇప్పుడు పోలీసు శాఖను కుదిపేస్తోంది. వివరాలివీ.. పంచలింగాల అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టులో 2021 జనవరి నెలలో పోలీసుల తనిఖీలో ఎలాంటి బిల్లులు లేకుండా పక్క రాష్ట్రాలకు రవాణా చేస్తున్న రూ.80 లక్షల విలువ చేసే 105 తులాల వెండి ఆభరణాలు, రూ.2.50 లక్షల నగదు సీజ్ చేశారు. వీటన్నింటినీ అప్పటి సీఐ ఆధ్వర్యంలో అర్బన్ తాలూకా స్టేషన్‌లో భద్రపరచినట్లు సమాచారం.

నిబంధనలకు విరుద్ధంగా..

వాస్తవంగా ఎలాంటి బిల్లులు లేకుండా దొరికిన విలువైన వస్తువులు, నగదును ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ వారి ఆధీనంలో ఉంచాలనేది నిబంధన. అయితే సదరు సీఐ ఈ నిబంధన తనకు వర్తించదు అనుకున్నారో, లేక అడిగే వారు ఎవరు అనుకున్నారో కానీ స్టేషన్‌లోనే ఉంచుకున్నట్లు తెలుస్తోంది. ఒక్కడే అంత మొత్తాన్ని అరిగించుకులేను అనుకున్నాడేమో.. ఓ రైటర్, మరో ఇద్దరు పోలీసులను ఈ వ్యవహారంలో కలుపుకున్నట్లు సమాచారం.

యజమానుల రాకతో వెలుగులోకి..

తనిఖీల్లో పట్టుబడిన వెండి, నగదుకు సంబంధించి యజమానులు ఈనెల 27న తగిన ఆధారాలతో పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. అయితే పట్టుబడిన సమయం నుంచి ఇప్పటి వరకు ఆ పోలీసుస్టేషన్‌లో ముగ్గురు అధికారులు మారిపోయారు. ఇప్పుడున్న సీఐ జరిగిన విషయాన్ని తెలుసుకొని వెండి, నగదు అప్పగించే ప్రయత్నం చేయగా అసలు వాటి జాడనే లేదని తెలిసి అవాక్కయ్యారని తెలిసింది. గోప్యంగా ఉంచితే తన తలకు చుట్టుకుంటుందని భావించి విషయం ఉన్నతాధికారుల దృష్టికి చేరవేసినట్లు సమాచారం.

అయితే సీజ్ చేసిన వెండి, నగదుకు సంబంధించి తగిన ఆధారాలతో ఇటీవల పోలీసుస్టేషన్‌కు చేరిన యజమానులకు వాటిని అప్పగించే ప్రయత్నం చేయగా వాటి ఊసే లేకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

రహస్య విచారణ


సుమారు రూ.80లక్షలకు సంబంధించిన వ్యవహారం కావడంతో పోలీసు ఉన్నతాధికారి రహస్య విచారణ చేయించినట్లు తెలిసింది. అప్పటి సీఐ పట్టుబడిన వెండి, నగదును పోలీసుస్టేషన్‌లోనే భద్రపరిచి మాయం చేసినట్లు దాదాపుగా నిర్ధారణ అయినట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన నివేదిక త్వరలో ఎస్పీకి అందజేయనున్నట్లు తెలుస్తోంది. అయితే అప్పట్లో అదే పోలీసుస్టేషన్‌లో పని చేస్తున్న ఓ మహిళా ఉద్యోగి పాత్ర కూడా ఈ ఘటనలో చర్చనీయాంశంగా మారింది.

వ్యక్తి దారుణహత్య


ఉసేన్‌బాషా (ఫైల్)

కౌతాళం: మండల పరిధిలోని హాల్వి గ్రామంలో బుధవారం రాత్రి ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ఉసేన్‌బాషా (37) అలియాస్ ఉషా బ్రాందీ షాపులో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బుధవారం రాత్రి ఎప్పటిలాగే భోజనానంతరం వాకింగ్‌కు వెళ్లాడు. పాల డెయిరీ వరకు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో వల్లూరు క్రాస్ రోడ్డు వద్ద గుర్తు తెలియని దుండగులు మారణాయుధాలతో దాడి చేశారు. కొన ఊపిరితో ఉన్న ఉషాను కౌతాళం వరకు ఆటోలో తరలించి అక్కడి నుంచి 108 వాహనంలో ఆదోనికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా హత్యకు గల కారణాలు తెలియరాలేదు.

లక్ష్మీరంగనాథుడు పెళ్లికొడుకాయెనే!


అలంకరణలో స్వామివారు

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథస్వామిని పెళ్లి కుమారుడిగా ముస్తాబు చేశారు. స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు బుధవారం పూలచపురం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి మూల, ఉత్సవ విగ్రహాలకు పంచామృతంతో అభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం స్వామి వారిని పట్టువస్త్రాలతో పెళ్లి కుమారునిగా అలంకరించారు. పదిరోజుల పాటు ఇక్కడ ఉత్సవాలు జరిగిన అనంతరం నెల్లూరు జిల్లా శ్రీరంగాపురంలో శ్రీమహాలక్ష్మి అమ్మవారితో స్వామి వారి వివాహం అంగరంగ వైభవంగా జరుగుతుందని అర్చకులు తెలిపారు. గురువారం స్వామివారికి సింహవాహన సేవ నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వెంకటరమణ, చైర్మన్ ప్రతాపరెడ్డి తెలిపారు.

మంత్రి, ఎమ్మెల్సీలకు ఘన సన్మానం


ప్రభుత్వ విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ కత్తినరసింహారెడ్డిని సత్కరిస్తున్న మంత్రి, జెడ్పీ చైర్మన్ తదితరులు

కర్నూలు(అర్బన్): మంత్రి గుమ్మనూరు జయరాంతో పాటు ఈ నెల 29వ తేదీతో పదవీ బాధ్యతలు ముగిసిన ప్రభుత్వ విప్ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డిని జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి, జెడ్పీటీసీలు ఘనంగా సన్మానించారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో సర్వసభ్య సమావేశం ముగిసిన అనంతరం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, తొగురు ఆర్థర్, కాటసాని రామిరెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవతేజ, జెడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి, డ్వామా ఎంఅండ్‌ఈ టి. విజయభాస్కర్‌నాయుడుతో పాటు రెండు జిల్లాలకు చెందిన జెడ్పీటీసీ, ఎంపీపీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీలుగా గుర్తిస్తూ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసేందుకు మంత్రి జయరాం నాలుగు సంవత్సరాలుగా ఎంతో శ్రమించారన్నారు. అలాగే ... జెడ్పీ సభ్యులుగా ప్రభుత్వ విప్ గంగుల ప్రభాకర్‌రెడ్డి, కత్తి నరసింహారెడ్డి గత పాలక వర్గంలో, ప్రస్తుత పాలకవర్గంలో జరిగిన అనేక సమావేశాలకు హాజరై ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ఎంతో విలువైన సలహాలు, సూచనలు అందించారన్నారు. కార్యక్రమంలో దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథరెడ్డి సతీమణి, అవుకు జెడ్పీటీసీ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సైకో హల్‌చల్


పత్తికొండ ప్రధానరోడ్డులో ఇనుప రాడ్డుతో వీరంగం సృష్టిస్తున్న సైకో

పత్తికొండ రూరల్: పట్టణంలో ఓ వ్యక్తి వీరంగం సృష్టించాడు. పలు వాహనాల అద్దాలను పగలగొట్టడమే కాక ఇద్దరిపై దాడికి పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే.. హోసూరు గ్రామానికి చెందిన వన్నూర్‌వలికి మతిస్థిమితం సరిగా లేదు. గ్రామంలో పొలం పనులు చేసుకునే ఈయన వ్యక్తిగత పనిమీద బుధవారం ఉదయం 11 గంటల సమయంలో పత్తికొండకు వచ్చాడు.ఉన్నట్టుండి పోలీసు స్టేషన్ ఎదుట ప్రధాన రహదారిలో రోడ్డుకు అడ్డంగా వెళ్లి దారిలో వెళ్తున్న కారుని ఆపి పిడిగుద్దులతో అద్దాలు పగులగొట్టాడు. తర్వాత అక్కడే ఓ ఇనుప పైపును పెకిలించి దాంతో ఆర్టీసీ బస్సు, రెండు జీపుల అద్దాలను ధ్వంసం చేసి ఆర్టీసీ కండక్టర్, మఫ్టీలో ఉన్న కానిస్టేబుల్ రామాంజినేయులుపై దాడి చేశాడు. తర్వాత ఇనుప రాడ్డు తీసుకుని పోలీసు స్టేషన్‌లోకి వెళ్లి ఫర్నీచర్‌పై బాదుతూ హల్‌చల్ చేశాడు. అప్రమత్తమైన పోలీసులు స్థానికుల సాయంతో చేతికి సంకేళ్లు వేసి స్టేషన్‌లో కూర్చోబెట్టారు. గతంలో కూడా ఇదే విధంగానే ఇతనిపై వాహనాల అద్దాలు ధ్వంసం చేసిన కేసు ఉంది. వన్నూర్‌వలిపై కేసు నమోదు చేసి చికిత్స నిమిత్తం విశాఖపట్నంలోని మెంటల్ ఆసుపత్రికి తరలిస్తామని సీఐ మురళీమోహన్ తెలిపారు.

మహానందీశ్వరుడికి రూ.23.53 లక్షల ఆదాయం


కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

మహానంది: మహానందీశ్వరుడికి రూ.23,53,504 ఆదాయం లభించినట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గత 29 రోజులుగా భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను బుధవారం అభిషేకమండపంలో లెక్కించారు. కామేశ్వరీదేవి, మహానందీశ్వర, కోదండ రామాలయం, తదితర ఆలయాల ద్వారా రూ.22,95,048, అన్నదానం విభాగం ద్వారా రూ. 40,056, గోశాల ద్వారా రూ.18,400 లభించినట్లు ఈఓ చెప్పారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు గంగిశెట్టి మల్లికార్జున, వీరభద్రుడు, ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(అర్బన్): జిల్లాలోని మహాత్మాజ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి లక్ష్మీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలల ప్రవేశాలకు 4వ తరగతి పాసైన విద్యార్థులు అర్హులని, ఏప్రిల్ 4 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని, 16వ తేదీ పరీక్ష ఉంటుందని తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు వెబ్‌సైట్ https://mjpapbcwrei.apcfss.in లో వివరాలను నమోదు చేసుకోవాలన్నారు.

నిర్లక్ష్యానికి మూల్యం

- విద్యుత్ సమస్యల పరిష్కారంలో జాప్యం చేస్తే చర్యలు
- ఉమ్మడి జిల్లాలో 482 ఫిర్యాదులు గుర్తింపు
- నిర్లక్ష్యం వహించిన ఉద్యోగులకు మెమోలు
- జీతాల్లో నుంచి రూ.1.37 లక్షల కోత


విద్యుత్ భవన్

కర్నూలు(రాజ్‌విహార్): ఏదైనా సమస్య చెబితే విద్యుత్ శాఖ సిబ్బంది త్వరగా పరిష్కరించరు. ఫిర్యాదులను పట్టించుకోరు. ఇది వినియోగదారుల మాట. ఇక నుంచి ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే సదరు సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోనుంది ఆ శాఖ. సేవల్లో లోపానికి మెమో జారీ చేయడంతో పాటు వేతనాల్లో కోత విధించనుంది. ఇప్పటికే ఆ దిశగా కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఉమాపతి చర్యలకు శ్రీకారం చుట్టారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉద్యోగుల జీతాల్లో నుంచి కోతలు విధించి ఆ సొమ్మును సేవా లోపం కింద వినియోగదారుల ఖాతాలోకి జమా చేశారు. ఫలితంగా లైన్‌మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లతో పాటు ఏఈల్లోనూ కదలిక వచ్చింది.

482 మంది జీతాల్లోంచి రూ.1.37 లక్షల కోత

సేవల పట్ల నిర్లక్ష్యం వహించిన సిబ్బంది తగిన మూల్యం చెల్లించుకున్నారు. ఫ్యూజ్ ఆఫ్ కాల్స్, మరమ్మతులు, విద్యుత్ కనెక్షన్ల మంజూరు, వర్క్ ఆర్డర్ల ఎస్టిమేట్ల (అంచనాలు) జారీ వంటి వాటి పట్ల సకాలంలో స్పందించకుండా జాప్యం చేసిన 482 మంది జీతాల్లో నుంచి రూ.1.37 లక్షలు రికవరీ చేశారు. ఇందులో ఏఈలు, లైన్‌మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ లైన్‌మెన్లు తదితర ఆపరేషన్స్ అండ్ మెయింటినెన్స్ సిబ్బంది ఉన్నారు. కొన్నేళ్లుగా ఈ నిబంధన ఉన్నా.. అమలుకు నోచుకోలేదు. దీనిని తొలి సారి ఆచరణలో పెట్టడం విశేషం.

డివిజన్ల వారీగా...

డివిజన్ పేరు	జీతాల్లో కోత ఉద్యోగుల	కోత సొమ్ము
ఆదోని	208	రూ.50,100
డోన్	5	రూ.1,600
కర్నూలు టౌన్	150	రూ.31,150
కర్నూలు రూరల్స్	37	రూ.8,850
నంద్యాల	82	రూ.45,400
మొత్తం	482	రూ.1,37,100


బాధ్యత తెలియజేసేందుకే



వినియోగదారులు చెల్లించిన డబ్బుతోనే మనం నెల నెలా జీతాలు తీసుకుంటున్నాం. అలాంటప్పుడు సేవలు చేయాల్సిన బాధ్యత మన పైనే ఉంది. ఈ విషయం గత ఆరు నెలలుగా చెబుతున్నా కొందరి తీరులో మార్పు లేదు. అందుకే జీతాల్లో కోతలు విధించాం. ఇది ఉద్యోగులను భయపెట్టేందుకు కాదు.. వారి బాధ్యతను గుర్తు చేయాలన్న ఉద్దేశంతో ఇలా చేస్తున్నాం. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేసి వినియోగదారులకు సేవలపై భరోసా కల్పించాల్సిన అవసరం ఉంది.

– ఎం. ఉమాపతి, ఆపరేషన్స్ ఎస్ఈ, కర్నూలు.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య


శారద (ఫైల్)

కర్నూలు: కల్లూరు మండలం బాబా బృందావన్ నగర్‌లో నివాసముంటున్న కురువ శారద (36) బుధవారం ఉదయం ఇంట్లోని పడక గదిలో చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తెలంగాణ రాష్ట్రం వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన కురువ అంజన్న, మన్యమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు, ఒక కూతురు సంతానం. కూతురు శారదకు బృందావన్ నగర్‌కు చెందిన కురువ ఈరన్నతో 18 ఏళ్ల క్రితం వివాహమయ్యింది. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు సంతానం. శారద కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతుండేది. మానసికంగా క్రుంగిపోయి తనకున్న జబ్బు నయం కాదేమోనని కలత చెంది ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించగా కుటుంబ సభ్యులు కనుగొని ఉరి నుంచి తప్పించి 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనారోగ్యం కారణంగానే తన కూతురు ఆత్మహత్యకు పాల్పడిందని, ఈ విషయంలో ఇతర ఏ కారణాలు, అనుమానాలు లేవని తల్లి మన్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాల్గవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.